క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ పంపిణీ చేశారు. 18 మందికి చెక్కులను అందించారు. మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, కౌన్సిలర్లు నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్, తదితరులున్నారు.

మంత్రి పదవి రావాలని పూజలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవి రావాలని వేడుకుంటూ మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు గురువారం సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, కౌన్సిలర్లు నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 145 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు హరీష్ గౌడ్, నీరజ, ప్రిన్సిపల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ట్రాన్స్‌కో ఏఈగా జ్యోతి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల ట్రాన్స్‌కో ఏఈగా జ్యోతి మండలంలోని బంజర సెక్షన్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు నాగిరెడ్డిపేటలో విధులు నిర్వహించిన ఏఈ మనోరంజన్ బదిలీపై కామారెడ్డి వెళ్లారు. కామారెడ్డిలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న జ్యోతిని నాగిరెడ్డిపేటకు బదిలీ చేశారు. ట్రాన్స్‌కో సిబ్బంది ఏఈని ఘనంగా సత్కరించారు.

మద్నూర్ ట్రాన్స్‌కో ఏఈగా గోపికృష్ణ




మద్నూర్(జుక్కల్): మద్నూర్ ట్రాన్స్‌కో ఏఈగా గోపిక్రిష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డిలో కన్‌స్ట్రక్షన్స్ ఏఈగా పని చేసి అక్కడి నుంచి మద్నూర్ ట్రాన్స్‌కో ఏఈగా బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఏవైనా సమస్యలు ఉంటే 9440814157 నెంబరుకు ఫోన్ చేసి తెలపాలన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈ అరవింద్ బాన్సువాడ కన్‌స్ట్రక్షన్స్ ఏఈగా వెళ్లారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి



బాన్సువాడ: ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని ప్రిన్సిపల్ అసద్ ఫారుఖ్ అన్నారు. గురువారం బాన్సువాడ బాలికల జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో గతేడాది 62 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఈ సారి 100 శాతం సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రతి రోజూ కళాశాలకు వెళ్లేలా తల్లిదండ్రులు చూడాలని, విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవడానికి కళాశాలకు వచ్చి అధ్యాపకులతో చర్చించాలని అన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



కామారెడ్డి టౌన్: భిక్కనూర్ మండల కేంద్రంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు అందజేయాలని కోరుతూ సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినిపత్రం అందజేశారు. ఇళ్లకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయించి అందజేయాలని కోరారు. నేతలు కర్రోళ్ల రాజు, ప్రకాష్ రెడ్డి, రమేశ్ తదితరులున్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- గుంతలమయంగా మండల రోడ్లు
- పలుచోట్ల మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు మాయం
- రోడ్ల మరమ్మతులు చేసి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకుల విజ్ఞప్తి



ఆర్గొండ పరిధిలో తారు, కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు



కొండాపూర్ పరిధిలోని ప్రమాదకర మలుపు వద్ద లేని సూచిక బోర్డు

రాజంపేట: మండలంలోని రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్గొండ నుంచి సిద్దాపూర్ వరకు ప్రయాణం చేయాలంటే సాహసమే అని చెప్పాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా ఈ రోడ్ల పరిస్థితి మాత్రం మారడం లేదు. పట్టించుకునే వారు లేకపోవడంతో వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి రాజంపేట మీదుగా గుండారం, కొండాపూర్, సిద్దాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం కామారెడ్డి జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సుల ద్వారా చాలా మంది ప్రయాణాన్ని కొనసాగిస్తారు. అయితే ఈ ప్రయాణ సమయంలో ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో అరచేతిలో ప్రాణం పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రాజంపేట మండల కేంద్రం నుంచి సిద్దాపూర్ వరకు రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. రోగులు, గర్భిణులతో ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల జోక్యం చేసుకొని రాజంపేట మండల కేంద్రం నుంచి సిద్దాపూర్ వరకు రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టి, మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైతుబజార్‌లోనే కూరగాయలు విక్రయించాలి



రైతుబజార్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో రోడ్లపై కాకుండా గాంధీ గంజ్‌లో నిర్మించిన రైతుబజార్‌లోనే కూరగాయలను విక్రయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ రైతులు, చిరు వ్యాపారులకు సూచించారు. గురువారం సుభాష్‌రోడ్, జేపీఎన్ రోడ్, డైలీ మార్కెట్‌లో పర్యటించారు. కూరగాయల రైతులు, వ్యాపారులతో మాట్లాడారు. ప్రతి రోజు సుభాష్ రోడ్ మధ్యలో కూరగాయలు విక్రయించడంతో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని అన్నారు. సమస్య నివారించేందుకు గాంధీ గంజ్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఎస్సై శ్రీరామ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

త్వరగా డ్రైనేజీని పూర్తి చేయాలని వినతి



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న డ్రైనేజీని త్వరగా పూర్తి చేయాలని వ్యాపారులు గురువారం బీర్కూర్ తహసీల్దార్ శ్రీలతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో భాగంగా బీర్కూర్ కమాన్ నుంచి బస్టాండ్ వరకు ఇరువైపులా రోడ్డు విస్తరణను చేపట్టి డ్రైనేజీని నిర్మిస్తున్నారని, కానీ కోదండ రామాలయం ముందు ఉన్న దుకాణాల వద్ద రోడ్డు వెడల్పు చేయడం లేదని, అందరికి ఒకే న్యాయం ఉండాలని సూచించారు. ఆ దుకాణాల ముందు కూడా రోడ్డును వెడల్పు చేసి డ్రైనేజీని నిర్మించాలని కోరారు.

పోలియోరహిత దేశంగా తీర్చిదిద్దాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): భారతదేశాన్ని పోలియోరహిత దేశంగా తీర్చిదిద్దాలని కామారెడ్డి రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి అన్నారు. కృష్ణాజీవాడిలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ప్రపంచ పోలియో దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ జోనస్ పుట్టిన రోజు సందర్భంగా పోలియోపై అవగాహన కల్పించడమే కాకుండా విద్యార్థులకు పోలియోపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు శ్రీశైలం, ధనుంజయ, సత్యం, కృష్ణహరి, నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలపై దాడులు చేస్తే సహించం



లింగంపేటలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



బిచ్కుందలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



బిచ్కుందలో మాట్లాడుతున్న స్వామీజీ

సాక్షి నెట్‌వర్క్: హిందూ దేవాలయాలపై దాడులకు నిరసనగా లింగంపేట, బిచ్కుంద, నస్రుల్లాబాద్ మండలాలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా సాగింది. హిందూ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వ్యాపార దుకాణాలను మూసివేయించారు. అలాగే ప్రధాన వీధుల్లో ర్యాలీలు చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేవాలయాలపై దాడులు సహించమని హెచ్చరించారు. హిందూ ధర్మాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. బిచ్కుందలో నిర్వహించిన ర్యాలీలో బండాయప్ప మఠం పీఠాధిపతి సోమాయప్ప పాల్గొన్నారు.



లింగంపేటలో మూసి ఉన్న దుకాణ సముదాయాలు



నస్రుల్లాబాద్‌లో..

జీవనభృతి చెల్లించాలి



కామారెడ్డి టౌన్: వ్యవసాయ కార్మికులకు వెంటనే జీవనభృతి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. రైతులకు తెలియకుండా వారి పేరిట రూ.20 కోట్ల రుణాలు తీసుకున్న గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, నాయకులు ప్రకాష్, అన్వేష్ ఉన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి



రామారెడ్డి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో సానిటేషన్, తడి పొడి చెత్త సేకరణ విషయంపై సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు అరవింద్ రెడ్డి, సాగర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ



లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజిపేటలో గురువారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామసభలో వివరాలు వెల్లడించారు. ప్రత్యేకాధికారి మదన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, క్షేత్రసహాయకుడు సాయాగౌడ్, డీఆర్‌పీ స్వరందీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మీసాన్‌పల్లిలో..



ఎల్లారెడ్డిరూరల్: మీసాన్‌పల్లిలో గురువారం ఈజీఎస్ అధికారులతో కలిసి ఎంపీవో ప్రకాశ్, గ్రామ సభ నిర్వహించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో చేపట్టాల్సిన పనుల గురించి ఉపాధిహామీ కూలీలతో చర్చించారు. కార్యక్రమంలో ఏపీవో వినోద్, టీఏ, ఎఫ్ఏలు తదితరులున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షురాలు ఎల్లంకి రవళి

భిక్కనూరు: బాల్య వివాహాలను అరికట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఎల్లంకి రవళి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, బాల్యవివాహాలు ,సామాజిక ఆరోగ్యం అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురావద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండల సమాఖ్య అధ్యక్షులు రాజమణి, ఏపీఎం శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సాయి శ్రద్ధ, ఐశ్వర్యా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

సాందీపని డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ కేటాయింపు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్‌ను కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ యూనిట్‌ను కమాండింగ్ ఆఫీసర్, లుటినెంట్ కల్నల్ విష్ణు పి నాయర్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని, దేశ సేవ చేయడానికి ఇదొక మార్గమని అన్నారు. కళాశాల డైరెక్టర్లు ఆర్. హరిస్మరణ్‌రెడ్డి, బి. బాలాజీ రావు, రాజేశ్వరరావు, అకాడమిక్ ప్రిన్సిపల్ మనోజ్ కుమార్, ఎన్‌సీసీ సుబేదార్ రాణా, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘాలు మరింత బలోపేతం కావాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): అర్హతున్న సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని డీపీఎం వకులా అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య అధ్యక్షులు యశోద బాయి అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు వచ్చే నెల 10లోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఐకేపీ ఏపీఎం రవీందర్, సీసీలు, అకౌంటెంటు, మండల సమాఖ్య పాలకవర్గం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యరాజ్యసమితి దినోత్సవం



మాట్లాడుతున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. కిష్టయ్య మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి భద్రతల పరిరక్షణలో ఐక్యరాజ్యసమితి పాత్ర మరువలేనిదని అన్నారు. ఐక్యరాజ్యసమితి మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని రాజనీతి శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ప్రపంచ దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పి మూడో ప్రపంచ యుద్ధాన్ని నివారించడంలో ఐక్యరాజ్య సమితి పాత్ర అమోఘమని ప్రభుత్వ పాలన విభాగ అధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రాములు అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు జయప్రకాష్, రాజగంభీర్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డిలో 28న తలపెట్టనున్న ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీయస్ రాష్ట్ర కార్యదర్శి కత్తి పద్మారావు, ఎమ్మార్పీయస్ మండలాధ్యక్షుడు తొంట సాయిలు కోరారు. ధర్మయుద్ధ మహాసభకు సంబంధించిన కరపత్రాలను గురువారం నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సభకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అతిథిగా హాజరవుతారన్నారు. నాయకులు ప్రభాకర్‌దాస్, అంతిబాబు, ప్రభాకర్ తదితరులున్నారు.

గల్ఫ్ మృతులకు ఎక్స్‌గ్రేషియాపై హర్షం



రామారెడ్డి: గల్ఫ్‌లో 2023, డిసెంబర్ 7 నుంచి నేటి వరకు వివిధ కారణాలతో 160 మంది తెలంగాణ కార్మికులు మృతి చెందినట్లు అంచనా ఉందని, వారందరికి కలిపి రూ.6.కోట్ల 45లక్షల నిధులను విడుదల చేయడం పట్ల గల్ఫ్ సంఘం అధ్యక్షుడు బండ సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో గల్ఫ్ ఎన్నారై పాలసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. గల్ఫ్ మృతులకు కాంగ్రెస్ సర్కార్ పెద్ద దిక్కుగా ఉండి రూ. 5లక్షల ఇవ్వడంతో పాటు భరోసాగా నిలుస్తోందన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



బాన్సువాడలో సూచనలిస్తున్న ఏఎస్‌వో కిషన్



లింగంపేటలో మాట్లాడుతున్న డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి శివకుమార్



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకరచారి

బాన్సువాడ రూరల్/లింగంపేట/నాగిరెడ్డిపేట: త్వరలో చేపట్టనున్న కుల గణన సర్వేను పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ విషయమై బాన్సువాడ, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సర్వే చేపట్టాలన్నారు. పెద్ద పంచాయతీలు ఉంటే బ్లాకులుగా విభజించాలని, ప్రతి బ్లాకుకు ఒక ఎన్యూమరేటర్, సూపర్‌వైజర్‌ను కేటాయిస్తామన్నారు. అనుబంధ గ్రామాలు, తండాల్లోనూ సర్వే చేపట్టాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో కులగణన నిర్వహించే సిబ్బందిని ముందుగానే నియమించుకోవాలన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు వస్తాయని, అందరూ సిద్ధంగా ఉండాలన్నారు.

సంక్షిప్తం

మాల మహానాడు పోస్టర్ల ఆవిష్కరణ

నిజాంసాగర్(జుక్కల్): నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన మాల మహానాడు సభను జయప్రదం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు గైని విఠల్ పేర్కొన్నారు. గురువారం నిజాంసాగర్‌లో మాల మహానాడు ఆత్మగౌరవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. నేతలు గైని ప్రవీణ్ కుమార్, బేగరి రాజు, గైని సాయిలు, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

కటాఫ్ తేదీని తొలగించాలి

బీబీపేట: కటాఫ్ తేదీని తొలగించి, ఎలాంటి షరతులు లేకుండా బీడీ పరిశ్రమలో పనిచేసే వారందరికీ రూ.4016 జీవన భృతి ఇవ్వాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో బీడీ కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు ఆంజనేయులు, నాగారపు యెల్లయ్య, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

'డెయిరీ అభివృద్ధికి కృషి'

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి బీఎంసీని మరింత అభివృద్ధి చెందేలా తన వంతు కృషి చేస్తానని బీఎంసీ చైర్మన్ సాయిరెడ్డి అన్నారు. తాడ్వాయి బీఎంసీ భవనంలో గురువారం బీఎంసీ పరిధిలోని అన్ని పాలకేంద్రాల అధ్యక్షులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల బిల్లులు సకాలంలో రావాలని, సబ్సిడీపై దానా సరఫరా చేయాలని, బీఎంసీ ఖర్చుల వివరాలు, తదతర అంశాలపై చర్చించారు. నూతనంగా ఎంపికైన బీఎంసీ చైర్మన్ సాయిరెడ్డిని సన్మానించారు. పాల కేంద్రాల అధ్యక్షులు కృష్ణమూర్తి, రాజేశ్వర్‌రావు, సాయిరెడ్డి, లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ నిరంజన్‌రెడ్డి, సూపర్‌వైజర్ రమేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

రామారెడ్డి: దళారులకు ధాన్యం విక్రయించి రైతులు మోసపోవద్దని వడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో డైరెక్టర్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉప్పల్‌వాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నారాయణరెడ్డి ప్రారంభించారు. రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని నిర్వాహకులను కోరారు.

దళితవాడ సమస్యలు పరిష్కరించండి



భిక్కనూరు: అంతంపల్లిలోని దళితవాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరారు. ఈ మేరకు గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి భార్గవికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ.. జనావాసాల మధ్య పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని, మురికి కాలువలు శుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లి దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు.

ఆలయ గోపుర పనులు ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాం మందిర ఆలయంలోని శివుడి గోపురం శిథిలావస్థకు చేరడంతో గురువారం ఆలయ గోపురం శిఖర మరమ్మతు పనులను ప్రారంభించారు. దోమకొండకు చెందిన పబ్బ విజయ్ కుమార్ స్పందించి శిఖరం మరమ్మతు పనులు చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.